

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 13 నవంబరు 2024



వైసీపీ @ అరాచకం



కడప అంటే ఇప్పటి దాకా కళలకు కాణాచి. చారిత్రక కట్టడాలకు ప్రసిద్ధి. తిరుమల తిరుపతి తొలి గడప దేవునికడప ఇక్కడే ఉంది. తొలి వాగ్గేయకారుడు అన్నమయ్య, సామాజిక దురాగాతాలపై గళమెత్తిన వేమన, కాలజ్ఞానం బోధించిన వీరబ్రహ్మం ఇక్కడి వారే. అతిథులు వస్తేచాలు ఇంట్లో లేకున్నా.. అప్పు తెచ్చయినా ఆప్యాయంగా చూసుకోవడం ఇక్కడి జనం నైజం. అయితే వైసీపీ సోషల్ మీడియాతో కడప అంటేనే అసహ్యించుకునే పరిస్థితి వచ్చింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక సరికొత్త రాజకీయానికి తెర లేసింది. నచ్చనివారిపై కేసులు పెట్టడం, ఆస్తి లాక్కోవడమే పనిగా సాగింది. అదే సమయంలో సోషల్ మీడియా వేదికగా వైసీపీ మూకలు చెలరేగిపోయాయి. అప్పటి ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు సజ్జల భార్గవరెడ్డి వైసీపీ సోషల్ మీడియా బాధ్యతలు చేపట్టాక వికృతరూపం దాల్చింది. జిల్లాకు చెందిన జగన్ అండ్ కో సోషల్ మీడియా బ్యాచ్ అచ్చోసిన అంబోతుల్లా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, హోంమంత్రి అనిత, మంత్రి నారాలోకేశ్ ఇతర కుటుంబ సభ్యుల ఫొటోలు, వీడియోలు అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి పోస్టు చేస్తుంటారు. వైసీపీ హయాంలో ఎవరైనా సామాన్యుడు జగన్‌ను ప్రశ్నించినా సరే భార్గవరెడ్డి, రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో సైకో ముఠా వారి ఫ్యామిలీని టార్గెట్ చేస్తూ టార్చర్ చేసేవారు. సోషల్ మీడియానే గబ్బు పట్టించి కులాల మధ్య మతాల మధ్య విభేదాలు సృష్టించిన బ్యాచ్ కడప జిల్లాకు చెందిన వైసీపీవారు కావడం గమనార్హం.

- అధికారం ఉన్నప్పుడు రౌడీయిజం, దందాగిరి
- సోషల్ మీడియాలో ఇష్టారాజ్యం
- వైసీపీని ప్రశ్నించిన కుటుంబాలే టార్గెట్
- మహిళలు, పిల్లలను కించపరిచే యత్నం
- కడప పేరును రాష్ట్రంలోనే గబ్బుపట్టించిన సైకో బ్యాచ్
- వీరిలో ఒకరు మాజీ సీఎం జగన్ భార్య పీఏ
- కొందరు ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరులు
- వీళ్ల నిర్వాకం చూసి అసహ్యించుకుంటున్న జనం
- పోలీసు చర్యలతో వైసీపీ సైకో అండ్ కో బ్యాచ్‌లో వణుకు

(కడప-ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ఆవిర్భావానికి ముందు ఒకరకం రాజకీయాలు.. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రావడంతో బడుగు, బలహీనవర్గాలకు చట్టసభల్లో తమ వాణిని వినిపించే అపురూపమైన అవకాశం దక్కింది. అందుకే టీడీపీ అంటే బీసీల పార్టీ అంటారు. కాంగ్రెస్‌కు ఎస్సీఎస్టీలు మైనార్టీలు అండగా ఉంటారని చెబుతారు. ఇక బీజేపీ హిందువుల పార్టీగా ముద్రపడింది. అయితే మాజీ సీఎం జగన్ నేతృత్వంలో స్థాపించిన వైసీపీ మాత్రం అబద్ధాలు, అసత్య ఆరోపణలు, బూతులపార్టీగా పేరొందింది. ముఖ్యంగా సోషల్ మీడియా అంటేనే మొదట గుర్తుకు వచ్చేది వైసీపీనే. ఎందుకంటే 2019లో జరిగిన ఎన్నికల సమయంలో సోషల్ మీడియా ఖాతాలను వైసీపీ సమర్థవంతంగా ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చింది. అధికారం చేపట్టాక కూడా వైసీపీ సోషల్ మీడియాలో అసత్యాల ప్రచారం మానలేదు. ఈ పిచ్చి ముదిరి వైసీపీ సోషల్ మీడియా గ్యాంగ్ సైకోల్లా తయారయ్యారు. ఉచ్చనీచాలు మరిచి డబ్బు కోసం కొందరు, ప్రాపకం కోసం మరికొందరు సభ్య సమాజమే తలదించుకునేలా పోస్టులు పెట్టారు. నిన్న జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఇంత ఘోరంగా ఓడిపోవడానికి కూడా సోషల్ మీడియాలో అప్పటి ప్రతిపక్షాలు పెట్టిన పోస్టులు కూడా కారణమే. ఇప్పుడు వైసీపీ సోషల్ మీడియా సైకోలపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం మొదలుపెట్టింది. పరారీలో ఉన్న వైసీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డి, అతని అనుయాయులపై కేసులు నమోదు చేయడంతో ఒక్కసారి జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చ సాగుతోంది. ఇడుపులపాయలోని దివంగత మాజీ సీఎం వైఎస్సార్ పాదాల చెంతన వైసీపీ పురుడు పోసుకుంది. ఐదేళ్లపాటు అధికారంలో ఉంది. ఇదే జిల్లాకు చెందిన ఈ వైసీపీ సోషల్ మీడియా సైకోల వల్ల రాష్ట్రంలోనే కాదు.. జనాల్లో కూడా ఆ పార్టీని థూ అనే విధంగా తయారయింది.

ఎంపీ అవినాశ్‌కు చుట్టుకుంటున్న వైనం

సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోతున్న వర్రా రవీంద్రెడ్డి కడప ఎంపీ అవినాశ్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు. మాజీ సీఎం జగన్ భార్య భారతి వద్ద పీఏగా పనిచేశాడు. భారతి ఇంట్లో పనిచేసిన రవీంద్రరెడ్డి తరువాత వైసీపీలో క్రియాశీలకంగా మారాడు. సింహాద్రిపురానికి చెందిన హరి అనే దళితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సజ్జల భార్గవరెడ్డి బ్యాచ్‌పై కేసు నమోదైంది. కులాలను కించపరిచే విధంగా వర్రా రవీంద్రరెడ్డి పోస్టు చేస్తే వాటిని తీసేయాలని హరి కోరగా కులం పేరుతో అతడిని తిట్టడంతో పాటు రెండు లక్షలు డబ్బులు ఇవ్వ లేదంటే చంపేస్తానంటూ బెదిరించారు. దీంతో హరి ఫిర్యాదు మేరకు పులివెందుల పోలీసులు డీఎస్ఎస్ యాక్ట్ మేరకు సెక్షన్ 196, 308 (5), 351 (3), 353 (సి) 112 (2), (బి) 6/డబ్ల్యు 3 (5) డీఎస్ఎస్ ఇక ఇతర సెక్షన్లు సెక్షన్ 3 (1) (6), (ఎస్), (3 ఆఫ్ ఎస్సీ ఎస్టీ అమెండెంట్ యాక్ట్ 2015 మరియు సెక్షన్ 67ఆఫ్ ఐటి యాక్ట్ మేరకు ఏ-1గా వర్రి రవీంద్రరెడ్డి, ఏ-2గా సజ్జల భార్గవరెడ్డి, ఏ-3గా సింగారెడ్డి అర్జున్‌రెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసులో వర్రా రవీంద్రరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించడంతో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో ఎంపీ అవినాశ్‌రెడ్డి ఆయన పీఏ బండి రాఘవరెడ్డి పేర్లు కూడా బయటకు వచ్చాయి. అవినాశ్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి చెబితేనే తాను పోస్టులు పెట్టానని తెలిపాడు. తాడేపల్లి కేంద్రంగా వైసీపీ సోషల్ మీడియా కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ఆ బ్యాచ్ అంతా కడపకు చెందిన వారు కావడం గమనార్హం. వీరందరిపై రాష్ట్రవ్యాప్తంగా కేసులు నమోదవుతున్నాయి. సైకోల పోస్టుల వెనుక ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి హస్తం ఉందని వెలుగు చూస్తుండటం, వరుస అరెస్టులతో వైసీపీ కలవరపడుతోంది.



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు వర్రా రవీంద్రరెడ్డి అతడికి సహకరించిన మరో ఇద్దరు

పోలీసులకు ఫిర్యాదులతో వైసీపీలో వణుకు

మనకు రాజ్యాంగం మాట్లాడే హక్కు కల్పించింది. ఏ పార్టీ అయినా సరే పార్టీ సిద్ధాంతాలను మీడియా, సోషల్ మీడియా, ఇతరత్రా మాధ్యమాల ద్వారా జనాల్లోకి తీసుకువెళ్లవచ్చు. అధికార పార్టీ వైఫల్యాలను ప్రశ్నించవచ్చు. అయితే వైసీపీ జగన్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితి మారిపోయింది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే వైసీపీ సోషల్ మీడియా రెచ్చిపోయేది. ముఖ్యంగా సజ్జల భార్గవరెడ్డి ఇన్‌చార్జి అయ్యాక.. ఇక అందులో అంతా బూతుపురాణమే. కాసులకోసం ఈయన బ్యాచ్ ఎంతనీచమైన పోస్టులు పెట్టేదానికైనా దిగజారింది. తమ ఇంట్లో మహిళలు, పిల్లలు ఉన్నారనే ఇంగితజ్ఞానం మరిచి సజ్జల భార్గవరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ సైకోగా పేరొందిన వర్రా రవీంద్రరెడ్డి నీచమైన పోస్టులు పెట్టారు.

విజ్ఞతతో వ్యవహరించండి

- విద్వేషాలు సృష్టించే పోస్టులు పెట్టవద్దు
- సోసల్ మీడియా అకౌంట్స్, పోస్టులను పర్యవేక్షించేందుకు..
- జిల్లాస్థాయిలో ప్రత్యేక బృందం ఏర్పాటు
- ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు

కడప క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, టెలిగ్రాం తదితర సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేటప్పుడు విజ్ఞతతో వ్యవహరించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ, కడప జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్గాల మధ్య విద్వేషాలు రగిల్చే విధంగా వ్యక్తిగత ఫొటోలు మార్ఫింగ్ చేసినా, మానాభిమానాలు దెబ్బతినేవిధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా, మతపరమైన సున్నిత అంశాల్లో అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించినా.. కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. అసభ్యకరమైన పోస్టులు పెట్టే వారిపై సైబర్ సెల్ మీడియా విభాగంలో ప్రత్యేక నిఘా ఉంచామని, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడేవారిపై చర్యలు తప్పవని తెలిపారు. ఫేక్ న్యూస్ వ్యాప్తి లేదా ఫార్వర్డ్ చేసే వారిపై నిఘా ఉంచామని, నిజానిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో పోస్టు చేసేవారిపై, షేర్ చేసేవారిపై సంబంధిత గ్రూప్ అడ్మిన్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సోషల్ మీడియా అకౌంట్స్, పోస్టులు పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామని సాంకేతిక పరిజ్ఞానంలో సుశిక్షితులైన వీరు నిరంతర నిఘా ఉంచుతారని తెలిపారు.

ఎనిమిది ఇసుక ట్రాక్టర్లు సీజ్



చక్రాయపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట మండలం సిద్దారెడ్డిగారిపల్లె గ్రామ సమీపాన పాపాఘ్ని నదిలో మంగళవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న తలుపుల మండలానికి చెందిన ఎనిమిది ట్రాక్టర్లను తహశీల్దార్ విజయ్‌కుమారి చేశారు. అందులో నాలుగు ఇసుకతో ఉండగా, మరో నాలుగు ఇసుక తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉండడంతో ట్రాక్టర్లను సీజ్ చేసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉంచినట్లు తెలిపారు.

గంజాయి మత్తులో...

- పులివెందులలో చెలరేగుతున్న గంజాయి బ్యాచ్
- సేల్స్‌మేన్ల ద్వారా విస్తృతంగా విక్రయాలు
- నియంత్రణలో చేతులెత్తేసిన నిఘా వ్యవస్థ

వివరాలు 7లో..

సారాను పూర్తిస్థాయిలో అరికట్టాలి

- బెల్టుషాపు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరించాలి
- డిప్యూటీ కమిషనరు జయరాజ్

కడప క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడ కూడా సారా తయారీ, విక్రయాలు జరగకూడదని, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని డిప్యూటీ కమిషనర్ జయరాజ్ సిబ్బందిని ఆదేశించారు. కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఎక్సైజ్ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం షాపు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఈ నెల 15లోగా ఒరిజినల్ లైసెన్సు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేట్లకు విక్రయాలు జరిపితే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, ఏఐఎస్ వినోద్‌కుమార్ నాయక్, ఉమ్మడి జిల్లాల సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌లుగా ఆర్.మాధవి, ఆదినారాయణరెడ్డి





కడపఎడ్యుకేషన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్‌లుగా కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి (టీడీపీ), జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి (బీజేపీ)లను నియమిస్తూ కూటమి ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీ కార్యక్రమాల నిర్వహణలో వీరిపాత్ర కీలకంగా ఉంటుంది. రాష్ట్రంలో ఒకరు చీఫ్‌విప్, మరో 15 మందిని విప్‌లుగా ఎంపిక చేయగా కడప జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలకు విప్‌లుగా స్థానం దక్కింది. అలాగే అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్(జనసేన)నూ విప్‌గా నియమించారు.

పదివేల టన్నుల ఇసుక ఏమైందో..?

- పగడాలపల్లెలో ఇసుక మాయం


పగడాలపల్లె సమీపంలో ఉన్న ఇసుక డంప్ (ఫైల్)

పెండ్లిమర్రి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఇసుక నిల్వ ఉన్న డంపుల నుంచి ఇసుకను తీసుకెళ్లే విధంగా ఉత్తర్వులు ఇచ్చింది. దానిలో భాగంగా ఇసుక డంపుల నుంచి తీసుకుని తరలించేందుకు, దాని నిర్వహణ పర్యవేక్షణ బాధ్యతను ఎంపీడీవోలకు అప్పజెప్పింది. అయితే.. పెండ్లిమర్రి మండల పరిధిలోని పగడాలపల్లె ఇసుక డంపులో పదివేల టన్నుల ఇసుక మాయమైంది. అది ఏమైందో ఇప్పటికీ తెలియదు. పగడాలపల్లె ఇసుక డంపులో జరుగుతున్న అవకతవకలపై అప్పటి వీఆర్వో సాదిక్ బాషా కలెక్టర్‌కు, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపడితే ఇసుక డంపు మాయం వెనుక ఎవరి హస్తం ఉందో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కాగా.. పెండ్లిమర్రి ఎంపీడీవోగా ప్రమోషన్‌పై కర్నూలు జిల్లా నుంచి 14 నెలల కిందట జగన్‌మోహన్‌రెడ్డి వచ్చారు. ప్రభుత్వం మారింది. జిల్లాలోని ఎంపీడీవోలు అందరికీ స్థానచలనం అయింది. అయితే పెండ్లిమర్రి ఎంపీడీవో మాత్రం ఇప్పటికీ ఇక్కడే కొనసాగుతుండటం విశేషం.


ప్రస్తుతమున్న ఇసుక నిల్వలు

ఇసుక పంపిణీ సజావుగా జరగాలి

- ఇసుక బుకింగ్, సరఫరాపై సమావేశంలో కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన బుకింగ్ కేంద్రాల్లో సజావుగా ఇసుక పంపిణీ జరగాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ఇసుక బుకింగ్, సరఫరా, ఇసుక లభ్యత తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలిసి కలెక్టర్ డీఎల్‌సీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక పంపిణీ ప్రక్రియ నియమనిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక విధానంలో ప్రజల వద్ద నుంచి కంట్రోల్ రూము ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇసుక సరఫరాకు సంబంధించి 08562-246344 కంట్రోల్ రూము నెంబరుకు కాల్ చేసి సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు. ఫిర్యాదులూ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గనులు భూగర్భశాఖ డీడీ సూర్యచంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ అధికారి రాజ్యలక్ష్మి, గ్రౌండ్‌వాటర్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డీఆర్వో


డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా ఎం.విశ్వేశ్వరనాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాలు, సూచనల మేరకు ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో పారదర్శకంగా విధులు నిర్వర్తిస్తామన్నారు. అంతకు ముందు మర్యాదపూర్వకంగా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను కలిసి బొకే అందించారు. 1995 బ్యాచ్‌లో ప్రొబేషనరీ డిప్యూటీ తహశీల్దారుగా విధుల్లో చేరినప్పటి నుంచి వివిధ హోదాల్లో పనిచేస్తూ ఏపీ సీఆర్డీఏలో స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తూ ప్రస్తుతం డీఆర్వోగా ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్, సిబ్బంది కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం, డిప్యూటీ సీఎంల మధ్య వరద పుట్టినరోజు వేడుకలు


ఎమ్మెల్యే వరదకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం, డిప్యూటీ సీఎం

ప్రొద్దుటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంతుల మధ్య ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. విజయవాడ అసెంబ్లీ సమావేశాల కోసం వెళ్లిన వరదరాజులరెడ్డికి మంగళవారం పుట్టిన రోజు కావడంతో ఆయనకు సీఎం, డిప్యూటీ సీఎం స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. 84 ఏళ్ల వయస్సులోనూ ఆయన ఎమ్మెల్యేగా గెలిచి ఆరోగ్యంగా అసెంబ్లీ సమావేశాల్లో, ఇతర సమీక్షా సమావేశాల్లో అలుపెరగక పాల్గొనడంపై అభినందించారు. ఈ వేడుకల్లో మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవిత, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


అవి సూపర్ ఫ్లాప్ పథకాలు

- ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

వేంపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు కాదు సూపర్ ఫ్లాప్ పథకాలుగా మారాయని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. యువతను నమ్మించి మోసగించారని, నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించలేదన్నారు. ఇచ్చిన హామీలను ఎలా అమలుపరుస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ అధికార పక్షానికి, ప్రతిపక్షానికి రెండింటికి పనికిరాడని తులసిరెడ్డి విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు అరాచకపాలన సాగించిన ఆయన ప్రతిపక్షంలో ప్రజల సమస్యల గురించి అసెంబ్లీలో చర్చించేందుకు వెళ్లకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ఇంటింటి సౌభాగ్యం సాధ్యమని తెలిపారు.

పెద్దదర్గా ఉరుసును విశ్వవ్యాప్తం చేయాలి

- రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి హర్షవర్ధన్



సమీక్షలో ప్రసంగిస్తున్న హర్షవర్ధన్

కడప కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేలా అమీన్‌పీర్ దర్గా (పెద్దదర్గా) ఉరుసు మహోత్సవాలను నిర్వహించాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి హర్షవర్ధన్ దర్గా ఉత్సవ కమిటీ సభ్యులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అమీన్‌పీర్ దర్గా ఉరుసు మహోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధ్యక్షతన ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం జరిగింది. కలెక్టర్‌తో పాటు జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవో జాన్ ఇర్విన్, నగర కమిషనర్ మనోజ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ ఉరుసు ఉత్సవాల ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. రెవెన్యూ, సంబంధిత శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లను పూర్తిచేసి ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. తదనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ చేలా కార్యక్రమంతో ఉరుసు ఉత్సవాలను నాంది పలికామన్నారు. ఉరుసు మహోత్సవాలు 11వ తేదీ నుంచి 21 వరకూ కన్నుల పండువగా జరుగనున్నాయన్నారు. ప్రధానంగా 16, 17 తేదీలలో జరిగే గంధం, ఉరుసు ఉత్సవ ఘట్టాలకు లక్షలాది మంది భక్తులు, వీఐపీలు హాజరవుతారన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుంగా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. రైల్వేస్టేషన్, బస్ స్టేషన్, దర్గా వరకూ నగరంలోని అన్ని రూట్లను కవర్‌చేస్తూ నిరంతరాయంగా బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని ఆదేశించారు. కార్యక్రమంలో పెద్దదర్గా మేనేజర్ మహ్మద్ అలీఖాన్, డీఎంహెచ్ఓ నాగరాజు, ఫైర్ అధికారి ధర్మారావు, ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఇమ్రాన్, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య, ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, దర్గా మత పెద్దలు పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జిల్లా సహకారశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో 71వ అఖిల భారత సహకార వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ 14 నుంచి 20 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర ఎంతో ఉందన్నారు. 14న సహకార సంఘాల బలోపేతానికి సహకార మంత్రిత్వశాఖ అమలు చేస్తున్న కొత్త కార్యక్రమాలు, 15న నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన, 16న వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర, 17న సహకార సంఘాలు వ్యాపార ప్రయోజక సంస్థలుగా రూపాంతరం చెందే కార్యక్రమాలు, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించే కార్యక్రమాలు, 19న మహిళలు, యువత, బలహీన వర్గాల సంక్షేమంలో సహకార సంఘాలు, 20న సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనలో, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకారశాఖ అధికారి గురుప్రకాశ్‌రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటికే పోస్టల్ సేవలు : ఎస్పీ లక్ష్మణ్

రూ. 300కే ఖాతా ప్రారంభం

సంక్షేమ పథకాల లావాదేవీలు పోస్టాఫీసుల్లోనే


ఎంపీడీఓతో మాట్లాడుతున్న పోస్టల్ అధికారి లక్ష్మణ్

పెద్దతిప్పసముద్రం నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసుల ద్వారా ప్రజలు ఖాతాలు తెరిస్తే సంక్షేమ పథకాల లావాదేవీలు డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాలకే నేరుగా అందుతాయని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ (ఎస్పీ), బి. లక్ష్మణ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం అజాద్‌తో భేటీ అయి పోస్టాఫీసుల్లో ఖాతాలను తెరిచేందుకు సచివాలయ ఉద్యోగులు సహకరించాలని కోరారు. గ్రామీణ తపాలా బ్రాంచుల్లో ప్రజలు ఆధార్ కార్డుతో ఖాతాను ప్రారంభిస్తే సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల పోస్టాఫీస్ ఖాతాల్లో పడతాయన్నారు. బ్యాంకులు అందుబాటులో లేని గ్రామాల్లో సైతం గ్రామీణులకు ఉపయోగం ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే రైతుభరోసా, ఉపాధిహామీ, పెన్షన్ ప్రభుత్వం అందించే పథకాల లావాదేవీని ప్రతి ఖాతాదారుడు ఇంటిచెంతనే లబ్ధి పొందే అవకాశాలు ఉంటాయన్నారు. లబ్ధిదారులు సచివాలయాల పరిధిలోనూ ఆధార్ కార్డుతో రూ. 300 చెల్లించి ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ పేమెంట్ (ఐపీబీపీ) ద్వారా ఖాతాను ప్రారంభించవచ్చన్నారు. అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో సుమారు 470 తపాలా బ్రాంచీలు ఉన్నాయని అందులో తాము 2లక్షల 70 వేల ఖాతాలు చేయాలనే లక్ష్యంతో తమ సిబ్బంది పని చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఖాతాలను ప్రారంభించామని నెలాఖరులోపు లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సచివాలయ ఉద్యోగులు, మండల అధికారులు సహకరించాలన్నారు. మాఖాతాలకు ఫోన్ పే, గూగుల్ పే కూడా అనుసంధానం చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్, నీలిమ, పీటీఎం పోస్టాఫీసు ఎస్పీఎం రాజారెడ్డి, గ్రామీణ తపాలా ఉద్యోగుల యూనియన్ సెక్రటరీ శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు

ప్రయాణికులకు తప్పని అవస్థలు

ములకలచెరువు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మీదుగా నడిచే రైళ్లు మంగళవారం ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. నరసాపురం నుంచి ములకలచెరువు మీదుగా ధర్మవరం జంక్షన్‌కు నడిచే ధర్మవరం ఎక్స్‌ప్రెస్ సాంకేతిక కారణాలతో రెండున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడిచింది. ఈ రైలు పీలేరుకు తెల్లవారుజామున 5.39 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 7.54కు, కలికిరికి తెల్లవారుజామున 5.54 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 8.14 గంటలకు, మదనపల్లె రోడ్‌కు ఉదయం 6.19కి రావాల్సి ఉండగా ఉదయం 8.44కు, ములకలచెరువుకు ఉదయం 6.49కి రావాల్సి ఉండగా 9.30 గంటలకు వచ్చింది. రైలు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరుపతి నుంచి గుంతకల్లు జంక్షన్‌కు రోజూ ఉదయం నడిచే ప్యాసింజర్ రైలు ములకలచెరువుకు ఉదయం 10.39 గంటలకు రావాల్సి ఉండగా మధ్యాహ్నం 12.12 గంటలకు వచ్చింది. గుంతకల్లు జంక్షన్ నుంచి తిరుపతికి నడిచే మరో ప్యాసింజర్ రైలు ములకలచెరువుకు ఉదయం 10.49 గంటలకు రావాల్సి ఉండగా మధ్యాహ్నం 12.17 గంటలకు వచ్చింది.

ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న సదరున్నీసా


సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న సదరున్నీసా

రైల్వేకోడూరు, నవంబరు 12:(ఆంధ్రజ్యోతి) అనంతరాజుపేట ఉద్యాన కళాశాల కూరగాయల విభాగాధిపతి సయ్యద్ సదరున్నీసా సోమవారం విజయవాడలో నిర్వహించిన విద్యా దినోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్నట్లు మంగళవారం ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్ తెలిపారు. 20 ఏళ్లుగా ఆమె చేసిన సేవకు గుర్తింపు లభించిందని ఆయన తెలిపారు. తోటి అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రెడ్డి మోక్షిత్ మృతిపై పౌరహక్కుల సంఘం విచారణ


ఉపాధ్యాయులను విచారిస్తున్న దృశ్యం

పీలేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్యారంపల్లె గురుకులంలో రెడ్డి మోక్షిత్ ఉదంతంపై ఉమ్మడి కడప జిల్లా పౌరహక్కుల సంఘం నేతలు మంగళవారం విచారణ చేపట్టారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు నేతృత్వంలోని బృందం గ్యారంపల్లె గురుకులం, పీలేరు ప్రభుత్వ ఆస్పత్రి, కేవీపల్లె పోలీసులు, రెడ్డి మోక్షిత్ తల్లిదండ్రులను విచారించింది. ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి రవిశంకర్ మాట్లాడుతూ మోక్షిత్ మరణంపై అతని తల్లి అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. తమ విచారణలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలిందని, ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతోనే మోక్షిత్ మృతి చెందాడన్నారు. అనుమానాలను పోలీసులు నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నేతలు రెడ్డయ్య, వంగిమళ్ల రమణయ్య పాల్గొన్నారు.

కాలుజారి బావిలో పడి యువకుడు మృతి


వెంకటేశు మృతదేహం

లక్కిరెడ్డిపల్లె,నవంబరు12(ఆంధ్రజ్యోతి): కస్తూరిరాజుగారిపల్లె పంచాయతీ గురయ్యగారిపల్లె యువకుడు వెంకటేశు(28) ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు. మృతుడి తల్లి వివరాల మేరకు... వెంకటేశు బెంగళూరులో ఉండేవాడు. సోమవారం బెంగళూరు నుంచి గ్రామానికి వచ్చాడు. మంగళవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లి ఎంతసేపటికీ రాకపోవడంతో మృతుడి తల్లి పొలం వద్దకు వెళ్లి చూడగా బావిలో శవమై తేలాడు. స్థానికులు శవాన్ని బయటకు తీసి పోస్టు మార్టం కోసం స్థానిక ప్రభుత్వ తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.


సీతారాం థియేటర్ భవనం

మణిమకుటం 'సీతారాం'

● అప్పటి అద్భుతం గోపురం..

● మరపురాని మధుర స్మృతులెన్నెన్నో

● అలరించిన టెంటు, థియేటర్లు..కనుమరుగు

● నెమరేసుకుంటున్న స్థానికులు

వాల్మీకిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నాటి ప్రజలకు కాలక్షేపం నాటకాలు, తోలుబొమ్మలాట, సినిమా, థియేటర్లు. 1958 డిసెంబరు 30న మొర్రంరెడ్డి నిర్మించిన సినిమా థియేటర్ సీతారాం జిల్లాకే మణిమకుటం. అప్పట్లో సినిమా ప్రొజెక్టర్, సౌండ్ సిస్టం, లైటింగ్ ఎఫెక్ట్ జపాన్ టెక్నాలజీ ఉపయోగించారు. థియేటర్ పునాది మొదలు థియేటర్ ప్రారంభం వరకు అప్పటి కడప కలెక్టర్ మేజర్ పీవీ రత్నం ద్వారా ప్రారంభించారు. 1962లో సీతారాం థియేటర్ తెరపై మొదటి సినిమా ప్రదర్శితమైంది. కొత్త సినిమా వచ్చిందంటే వీధి వీధంతా పండుగను తలపించేంది. వీధిలో మూడు రోడ్లు కలిసే ప్రాంతం కిటకిటలాడే జనంతో ఈలలు, కేకలతో నిండిపోయేది. కాలక్రమేణా జీవన వేగంలో మార్పురావడం, మదనపల్లెలో కొత్త థియేటర్ల నిర్మాణం, ఏసీ థియేటర్లతో కొత్త సినిమాల క్రేజీతో ప్రజలు మదనపల్లెకు వెళ్లి సినిమాలు చూడడం మొదలైంది. దీంతో 2008 ఫిబ్రవరి2వ తేదీన మహాయాగం, అన్నదానం, చేసి ప్రజలకు జీవితచక్రం, బండరాముడు, శ్రీకృష్ణలీల సినిమాలను ఉచితంగా ప్రదర్శించి సీతారాం సినిమా థియేటర్‌కు తెరదించేశారు. మరో సినిమా థియేటర్ సీపీ మహల్ కూడా ఇంతటి అనుభూతిని మిగిల్చినా 2009లో సినిమా థియేటర్ మూతపడింది. అప్పట్లో ప్రజలను అలరించిన సీతారాం థియేటర్ ప్రస్తుతం భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే పాఠశాలగా రూపాంతరం చెందగా మరోథియేటర్ సీపీ మహల్ రూపురేఖలు మార్చి కల్యాణ మండ పంలా మారిపోయింది. ఎంతో గొప్ప గుర్తింపు ఉన్న సీతారాం థియేటర్ విషయాలను గుర్తు చేసుకోవాల్సిందే. వివరాల్లోకెళితే...

వాల్మీకిపురం నాటి వాయల్పాడులో సుమారు 60ఏళ్ల కిందట సినిమా టెంట్లు, హాళ్ల గురించి చెప్పుకుంటూ పోతే నాటి మధుర స్మృతులు ఎంత గొప్పగా ఉంటాయో. అప్పట్లో వాయల్పాడు అని చెప్పగానే ఎంతో గొప్పగా చెప్పుకునే పేర్లు సీతారాం, సీపీ మహల్ సినిమా థియేటర్లు అలరించిన ప్రదర్శనలు, సినిమాలు లేవనడంలో సందేహం లేదు. సీతారామ్ థియేటర్ వ్యవస్థాపకులు మొర్రంరెడ్డి థియేటర్ నిర్మాణం జరిగిన తర్వాత 1962లో సీతారామ్ థియేటర్ తెరపై మొదటి సినిమా ప్రదర్శితమైంది. అప్పట్లో శ్రీ వేంకటేశ్వరస్వామి మహత్యం మొదలు శ్రీకృష్ణావతారం, శ్రీకృష్ణవిజయం, జీవితచక్రం, లక్ష్మీకటాక్షం, రాము, దసరా బుల్లోడు, ప్రేమ్‌నగర్ ఇలా ఎన్నో ఎన్‌టీఆర్, నాగేశ్వరరావ్, చిరంజీవి, తదితర ఎందరో అగ్రహీరోల సినిమాలు గొప్పగా అలరించాయి. అప్పట్లో పావలా పెట్టి సినిమా చూసిన వారు బయటికి వచ్చి సినిమా చూసిన అనుభూతిని వివరిస్తూ సినిమా గొప్పదనాన్ని ఎంతో గొప్పగా చెప్పుకునే రోజులు. సినిమా మారుతుందంటే రెండు మూడు రోజుల ముందు గోడలకు పోస్టర్లను అంటించేవారు. ఊరంతా గోడలకు పోస్టర్లు అంటిస్తుంటే ఎంతో ఆత్రంగా ఏం సినిమా వస్తోంది అంటూ వాకబు చేసేరోజులవి. ఉదయం ఎద్దుల బండితో ప్రచారం, మధ్యాహ్నం ఒంటి గంటకు థియేటర్ నుంచి ఊరంతా వినిపించేలా రికార్డులతో మ్యాట్నీ షోలు ప్రారంభమయ్యేవి. గడిచిన అర్ధ శతాబ్దంలో (50ఏళ్లు) ఒక్క సీతారామ్ థియేటర్‌లో 4041 సినిమాలు 58,400 ప్రదర్శనలు సాగాయి. 30ఏళ్ల కిందటే వాల్మీకిపురంలోని సినిమా థికేటర్లకు జిల్లాలో మోడల్ థియేటర్‌లుగా పేరుండేది. పిల్లలకు సైతం ఎన్నో బెనిఫిట్ షోలు చూపించిన మహా ఘని సీతారామ్ టాకీస్. సీతారామ్‌లో షో మొదలైందంటే ఆరోజు కొత్తపేట వీధి జనాలతో నిండిపోయేది. అలాంటి కళ ఊరి ప్రజలకు నేడు కనుమరుగైంది. నేటికీ ఎంతో ప్రాచుర్యం పొందిన సినిమా థియేటర్లు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం సీతారాం థియేటర్ పాఠశాలగా మారిపోగా సీపీ మహల్ భవనాన్ని కల్యాణ మండపంగా మార్చేశారు. ఎంతో అలరించిన ఈ సినిమా థియేటర్లు ప్రస్తుతం లేకపోవడం... ఎలా ఉన్నా ఒకప్పటి జ్ఞాపకాలను స్థానికులు గుర్తు చేసుకుంటుంటా రు. ఆ జ్ఞాపకాలు చిరకాలం ఉండిపోతాయని అంటున్నారు. నాటి నిర్మాణాలలో సీతారాం థియేటర్ భవనాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. అందులో పనిచేసిన సిబ్బంది కూడా మధుర జ్ఞాపకాలను నెమరేసుకుంటున్నారు.


థియేటర్‌లోని ప్రొజెక్టర్(ఫైల్‌ఫొటో)


పాఠశాలగా మారిన సీతారామ్ థియేటర్

ఊరి నడిబొడ్డున ఓ కళ..



మా తాత మొర్రంరెడ్డి స్థాపించిన సీతారాం థియేటర్ ఊరి నడిబొడ్డున ఓ ప్రత్యేకమైన కళ. 60ఏళ్ల కిందట అప్పటి కడప కలెక్టర్ మేజర్ పీవీ రత్నం చేతుల మీదుగా సినిమా హాలును ప్రారంభించారు. అప్పట్లోనే జిల్లా మోడల్ థియేటర్‌గా ఎంతో పేరు వచ్చింది. చిన్ననాటి రోజుల్లో రోజూ స్నేహితులతో కలిసి థియేటర్ వద్ద సందడి చేసేవాళ్లం. ఆ రోజులు, ఆ విలువలు మధుర జ్ఞాపకాలు.

మొర్రంరెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి, థియేటర్ యజమాని, వాల్మీకిపురం.

20ఏళ్లు ఆపరేటర్‌గా పనిచేశా..



సీతారాం థియేటర్‌లో 20ఏళ్లకు పైగా ప్రొజెక్టర్ ఆపరేటర్‌గా పనిచేశా. వందలాది సినిమాలు ప్రేక్షకులతో కలిసి చూసిన అనుభూతి ప్రత్యేకత. వేలాది ప్రదర్శనలతో అలరించిన సినిమా హాళ్లు ప్రస్తుతం లేవంటే బాధగా ఉంటోంది. హాలులో ఈలలు, కేకలు అంతా ఇంతా కాదు. ఆరోజులు, మధుర జ్ఞాపకాలు గుర్తుకువస్తుంటాయి. ఇప్పటికీ స్నేహితులు ఆపరేటర్ శీనా అనే పిలుస్తుంటారు. ఆధునిక యుగంలో పాత సినిమా హాళ్లు మరిచిపోతున్నారు.

శ్రీనివాసులు, (ఆపరేటర్ శీనా), గాంధీపేట, వాల్మీకిపురం.

టెంట్లు, థియేటర్ల కళ ఇక రాదు..



ఒకప్పుడు వాయల్పాడులో టెంటు ఉండేది. అప్పట్లోనే ఎందరో వచ్చేవారు. కొన్నేళ్లకు రెండు సినిమా థియేటర్లు కట్టడంతో రోజూ మూడు ఆటలతో సినిమాలు నడిచేవి. 15ఏళ్లు ఆపరేటర్‌గా పనిచేశా. అప్పట్లో ఆ వృత్తిలో చాలా గొప్పగా ఉండేది. జిల్లాలోనే మోడల్ సినిమా హాళ్లగా పేరున్న మా ఊర్లో సినిమా హాళ్లు లేవంటేనే బాధగా ఉంటుంది. గుర్తుకు వచ్చినప్పుడల్లా స్నేహితులతో నాటి జ్ఞాపకాలను పంచుకుంటుంటాం.

శ్రీనివాసశాస్త్రి, (ఆపరేటర్ శీనాస్వామి), వాల్మీకిపురం

సర్పంచ్ కనబడుట లేదు..!

బెంగళూరులో ఉద్యోగం ● ప్రస్తుతం హాంగ్‌కాంగ్ పర్యటనలో ● బినామి సర్పంచ్‌గా వైసీపీ నేత

అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు ● కోళ్లబైలు-2 సర్పంచ్‌కు డీఎల్‌పీఓ నోటీసులు


విచారణ అంశాలను ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌కు వివరిస్తున్న ఈఓఆర్డీ అబ్దుల్ షుకూర్

మదనపల్లె టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోళ్లబైలు-2 (వైఎస్సార్ కాలనీ) సర్పంచ్ శశికళ కనపడుట లేదని, పంచాయతీ ప్రజలు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఆమె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసం ఉన్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె విదేశీ పర్యటనలో ఉన్నట్లు వారు వివరించారు. ఇక్కడ వైసీపీ నేత బండి మనోహర్ బినామీగా వ్యవహరిస్తున్నాడని, దీనిపై అధికారులు విచారించాలన్న ఫిర్యాదుపై మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు విచారించి సర్పంచ్‌కు నోటీసులు ఇచ్చారు. వివరాల్లోకెళితే...

2021 ఫిబ్రవరిలో కోళ్లబైలు-2 సర్పంచ్‌గా శశికళ ఎన్నికయ్యారు. వాస్తవంగా ఆమె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. మూడేళ్లగా అప్పుడప్పుడూ ఆమె గ్రామ సభలకు వచ్చి వెళ్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే సర్పంచ్ బదులు ఆమె అన్న, వైసీపీ నేత బండి మనోహర్ సర్పంచ్‌గా ఉన్నాడని ప్రజలు ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారించాలని డీఎల్‌పీఓ నాగరాజు ఈఓఆర్‌డీ అబ్దుల్ షుకూర్‌కు లేఖ రాశారు. ఆదివారం ఈఓఆర్‌డీ కోళ్లబైలు-2కు వెళ్లి సర్పంచ్ శశికళ విషయమై విచారించారు. శశికళ బెంగళూరులో నివాసం వున్నారని, ఇటీవలే ఆమె విదేశీ పర్యటన నిమిత్తం హాంగ్‌కాంగ్ వెళ్లారని ఈఓఆర్‌డీకి ప్రజలు వివరించారు. సర్పంచ్ శశికళతో ఈఓఆర్‌డీ ఫోన్‌లో మాట్లాడగా తాను బయట వున్నానని, ఉన్నఫళంగా రమ్మంటే ఎలా వచ్చేదని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అయితే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం అధికారుల అనుమతిలేకుండా సర్పంచ్ విదేశాలకు వెళ్లరాదు. అంతేకాకుండా ప్రజలకు 15రోజులకు పైగా అందుబాటులో లేకుంటే సర్పంచ్ విధులను ఉపసర్పంచ్‌కు అప్పగించాల్సి వుంది. కానీ మూడేళ్లగా ఇక్కడ అవేమీ జరగలేదు. బెంగళూరులో వుంటూ ప్రజలకు అందుబాటులో లేరని ప్రజలు ఈఓఆర్‌డీకి చెప్పారు. దీనిపై ఈఓఆర్‌డీ అబ్దుల్ షుకూర్, కార్యదర్శి గిరిధర్ నాయక్ మంగళవారం ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌కు విచారణలో తేలిన అంశాలను, పంచాయతీ కార్యదర్శి గిరిధర్‌నాయక్‌తో కలసి వివరించారు.

సర్పంచ్‌కు డీఎల్‌పీఓ నోటీసులు

కోళ్లబైలు-2లో ఈఓఆర్డీ వెళ్లి విచారించారు. ఏవైనా సమస్యలు సర్పంచ్‌కు తెలియచేద్దామంటే ఆమె బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసం వున్నట్లు కొత్తగా కార్యదర్శిగా చేరిన గిరిధర్‌నాయక్ అన్నట్లు తెలిసింది. గ్రామపంచాయతీ సమస్యలను తీర్చే అధికారం, నిధులు డ్రా చేసే అధికారం కేవలం సర్పంచ్‌కు మాత్రమే వుందని, కార్యదర్శికి లేదని తెలిసింది. సింగిల్ ఆపరేషన్ మోడ్‌లో సీఎఫ్ఎంఎస్ పీడీ అకౌంట్స్ నిర్వహణ, పీఎఫ్ఎంఎస్ 15వ ఫైనాన్స్ నిధులు డ్రా చేసే అధికారం సర్పంచ్‌కు మాత్రమే వున్నట్లు తెలిసింది. పంచాయతీ రికార్డులు, ఎం-బుక్కులు, క్యాష్‌బుక్, ఓచర్లు, రిజల్యూషన్ రిజిస్టర్ అన్నీ సర్పంచ్ అన్న బండి మనోహర్ దగ్గర వున్నట్లు కార్యదర్శి రిపోర్టులో వున్నట్లు తెలిసింది. మరో విశేషమేమంటే పంచాయతీ చెత్త తరలించే ట్రాక్టర్, పారిశుధ్య పరికరాలు కూడా మనోహర్ ఆధీనంలోనే వున్నట్లు కార్యదర్శి నివేదికలో పేర్కొన్నారు.

సర్పంచ్ అధికార క్షేత్రం నుంచి 15 రోజులకు మించి గైర్హాజరైతే, విధులు నిర్వహించకుంటే, ఆ సర్పంచ్ అధికారాలు, విధులు, ఉప సర్పంచ్‌కు బదలాయించాలి. ఈ వివరాలన్నింటినీ పొందుపరుస్తూ డీఎల్‌పీఓ 11న సర్పంచ్ శశికళకు సంజాయిషీ కోరుతూ లేఖ రాశారు. ఏడు రోజుల్లో ఈ లేఖకు సంజాయిషి ఇవ్వాలని పేర్కొన్నారు. అంతేకాకుండా మూడేళ్లలో కోళ్ల బైలు-2 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన బి.ప్రశాంతి, బి.రవీంద్రనాయక్, ఎస్.షాబాద్, పి.విజయకుమారికి డీఎల్‌పీఓ మెమోలు జారీ చేశారు. వారు విధులు నిర్వహించిన కాలంలో పంచాయతీ రికార్డులు, క్యాష్‌బుక్కులు తదుపరి కార్యదర్శికి అప్పగించిన చార్జిషీట్ వివరాలు మూడు రోజుల్లో డీఎల్‌పీఓ కార్యాలయానికి నివేదించాలని మెమోలో పొందుపరిచారు.

చంపేస్తారా సారూ..

● విద్యార్థిని చితకబాదిన టీచర్

● లేచి నడవలేకపోతున్న విద్యార్థి

● వళ్లంతా గుల్లచేశాడు : తల్లి


గాయాలతో తల్లి ఒడిలో విద్యార్థి విఘ్నేశ్

సుండుపల్లె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని విద్యార్థిని టీచర్ వల్లంతా వాచేలా కొట్టాడని, తప్పు చేస్తే మందలించాలే తప్ప ఎవరూ కొట్టరని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. చితకబాదడంతో విద్యార్థి తీవ్ర అస్వస్థతకు లోనవడంతో విద్యార్థి తల్లి దండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేశారు. వివరాల్లో కెళితే... జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం సాయంత్రం కొందరు విద్యార్థులు కొట్టుకున్నారు. అక్కడ ఏడో తరగతి విద్యార్థి బొమ్మల విఘ్నేశ్ కూడా ఉండడంతో ఆ విద్యార్థి కూడా గొడవలో పాల్గొన్నాడన్న ఉద్దేశంతో టీచర్ కొట్టాడని తల్లి దండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు తప్పు చేస్తే భయపెట్టాలి లేదా తల్లిదండ్రులకు చెప్పాలే కానీ, వళ్లంతా వాచేలా కొట్టి లేవ లేని స్థితికి తీసుకువచ్చారంటూ తల్లిదండ్రులు, గుల్లవాండ్లపల్లె గ్రామస్తులు పాఠశాల వద్దకు వచ్చి ఆందోళన చేశారు. మీ పిల్లలను ఇలాగే కొడితే చూస్తూ ఉంటారా అని ఇతర ఉపాధ్యాయులను వారు ప్రశ్నించారు. గతంలో విఘ్నేశ్‌కు చేయి విరగడంతో సర్జరీ చేసిన చేతిపై వాతలు వచ్చేలా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి ఎక్కువగా అల్లరి చేస్తున్నాడని గతంలో అతని తండ్రికి చెప్పానని, ఈ రోజు కూడా అల్లరి చేయడంతోనే కొట్టానని, పొరపాటైందని టీచర్ లోకేశ్ చెప్పారు. ఇకపై అలా జరగకుండా చూసుకుంటానని క్షమాపణ చెప్పాడు. శాంతించిన తల్లిదండ్రులు విద్యార్థిని వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై విచారించి టీచర్‌పై చర్యలు తీసుకుం టామని మండల విద్యాఅధికారులు తెలిపారు.



ఎడమ చేతిపై, ఎడమ కాలిపై గాయాలు చూపుతున్న విద్యార్థి

రుణాల కేసులో ఒకరికి జైలు శిక్ష

వాల్మీకిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాల కేసులో గిరిప్రసాద్‌కు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో తీర్పు వెలువరించింది. ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. వాల్మీకిపురం మండలంలో 17 మంది రైతులు 2014కు ముందు వాల్మీకిపురం సహకార బ్యాంకులో రుణాలు పొంది వాటిని అప్పటి ఏజెంట్ గిరిప్రసాద్‌కు చెల్లించారు. అయితే రైతులు చెల్లించిన డబ్బును ఏజెంట్ బ్యాంకుకు కట్టలేదు దీంతో బ్యాంకుల నుంచి రైతులకు నోటీసులు అందడంతో బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం కోర్టులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాహనం చోరీ కేసులో మూడు నెలలు జైలు...

రాయచోటిటౌన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): వాహనం చోరీ కేసులో నిందితుడికి మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.. అన్నమయ్య జిల్లా కలికిరి మండలం గుండ్లచెరువు గ్రామం మజ్జిగవాండ్లపల్లె సీఆర్పీఎస్ కానిస్టేబుల్ రెడ్డిప్రసాద్ జూలై 4న రాత్రి రాయచోటి ఆర్టీసీ బస్టాండు ఆవరణలో బైక్‌ను పార్క్ చేసి వెళ్లాడు. లక్కిరెడ్డిపల్లె మండలం కర్నూతల గ్రామం వడ్డెపల్లె వాసి చౌడం రాజు అలియాస్ రాజు వాహనాన్ని దొంగిలించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరు పరచగా మూడు నెలల సాధారణ జైలుశిక్ష విధించినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ కడప డీఐజీగా ప్రసాద్

కలికిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ కడప డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా వీఎస్ఆర్ ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జిల్లా రిజిస్ట్రారుగా వున్న ప్రసాద్‌కు పదోన్నతి కల్పించి కడప డీఐజీగా నియమించింది. 15 రోజుల్లో ఆయన బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. గడువులోగా బాధ్యతలు చేపట్టకున్నా లేదా సెలవులో వెళ్ళినా ఈ ఏడాది పదోన్నతుల జాబితా నుంచి ఆయన పేరు తొలగిస్తారని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శిసోడియా ఆదేశాలు జారీ చేశారు.

పెన్నానదిలో మృతదేహం లభ్యం


రమణయ్య మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

సిద్దవటం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జంగాలపల్లె దర్శిపల్లె సమీప పెన్నానదిలో మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. సోమవారం రాత్రి స్థానికులు అందించిన సమాచారంతో జాలర్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. సిద్దవటం ఎగువపేట వాసి దేవర రమణయ్య(65)గా గుర్తించారు. కూతురు బత్తల లక్ష్మీదేవి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని పోలీసులు తెలియజేశారు.

గంజాయి మత్తులో...

- పులివెందులలో చెలరేగుతున్న గంజాయి బ్యాచ్
- 20, 50 గ్రాముల పొట్లాల్లో అమ్మకాలు
- సేల్స్‌మేన్ల ద్వారా విస్తృతంగా విక్రయాలు
- గంజాయి మత్తులో పెరుగుతున్న నేరాలు
- నియంత్రణలో చేతులెత్తేసిన నిఘా వ్యవస్థ

పులివెందుల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యువత విద్యార్థుల జీవితాల్లో గంజాయి విషపు వృక్షంగా మారుతోంది. స్మగ్లర్లు కూడా వారినే టార్గెట్ చేసుకొని వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు. కాలేజీ విద్యార్థులు, ఖాళీగా తిరిగే వారిని లక్ష్యంగా మత్తుకు బానిసలు చేస్తున్నారు. కొంతమంది స్వార్థపరులు రాజకీయ అవసరాలకు గంజాయి ముఠాలను తయారు చేశారు. ఆ మత్తులో యువకులు అరాచకాలకు పాల్పడుతున్నారు. ఇటీవల పులివెందులో జరుగతున్న ఘర్షణలు, హత్యాయత్నాలు, చోరీలు తదితర ఘటనలు గంజాయి మత్తులో జరుగుతున్నాయని పోలీసుల విచారణలో తేలింది. ఇక వృద్ధులు, ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో పట్టణంలో నిత్యం ఏదోక ఘటన చోటుచేసుకోవడం పోలీసులకు తలనొప్పిగా మారింది.

పట్టణంలోని రాణితోపు పార్కు గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారింది. ఈ ప్రాంతంలోని యువకులు పూటుగా గంజాయి సేవించి విచక్షణ రహితంగా ఘర్షణలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా పట్టణంలో ఖాళీ స్థలాలు, లేఅవుట్లు అధికంగా ఉండడం, కొన్ని స్థలాల్లో ఖాళీ షెడు ఉన్నాయి. ఇక్కడ జన సంచారం లేకపోవడంతో గంజాయి సేవించేవారికి ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో పట్టణంలో జులాయిగా తిరుగుతూ మత్తుకు అలవాటు పడ్డ కొంతమంది మైనర్లు చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా వాకింగ్ వెళ్లే మహిళలు, ఒంటరిగా ఉన్న వృద్ధులను టార్గెట్ చేసుకుని వారి మెడలో ఉన్న గొలుసులు లాక్కెళ్లి.. వాటిని వచ్చిన కాడికి విక్రయించి ఆ సొమ్ముతో మద్యం, గంజాయి సేవించి మత్తులో జోగుతున్నారు. రాత్రిపూట రోడ్లపై కేరింతలు కొడుతూ చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నారు. దీంతో పట్టణంలో నిత్యం ఏదోక చోట దొంగతనాలు జరుగుతున్నాయి. చిల్లర దుకాణాలు పగలగొట్టడం, ఊర్లకు వెళ్లిన ఇంటి డోర్లను పగలగొట్టడం, దేవాలయాల్లో హుండీలు ధ్వంసం చేసి నగదు అపహరణ చేస్తున్నారు. దీంతో బాధితులు పోలీసుస్టేషన్ చుట్టూ తిరుగుతుండటంతో పోలీసులు కొంతమంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

విద్యార్థులు బానిసలుగా మారుతూ...

ఇంటర్, డిగ్రీ చదువుతున్న సమయంలో స్నేహితులు, క్లాస్‌మేట్స్ క్రీడల్లో పరిచమయ్యే వ్యక్తుల ద్వారా విద్యార్థులు మత్తుకు అలవాటు



పడుతున్నారు. కొందరు 20 గ్రాములు, 30 గ్రాములు ప్యాకెట్లు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.200 నుంచి 300 వరకు వారికి విక్రయిస్తున్నారు. సిగరెట్లలో గంజాయి పొడి కలుపుకుని పీలుస్తూ బానిసలుగా మారుతున్నారు. దీంతో కొందరు స్మగ్లర్లు గంజాయి విక్రయాలకు సేల్స్‌మెన్స్‌ను నియమించుకుని కమిషన్‌తో పాటు నెలవారీ జీతాలు ఇస్తున్నారు. వీరు చేయాల్సింది కళాశాలల వద్ద బార్లు, మద్యం దుకాణాలు ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన వర్కర్లను టార్గెట్ చేసుకుని వారి వద్దకు వెళ్లి గంజాయి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనిపై పోలీసులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదన్న విమర్శలున్నాయి. పట్టణంలో గంజాయి, బహిరంగంగా మద్యం సేవించేవారిని నియంత్రించాలంటే ప్రత్యేకనిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఇటీవల జరిగిన నేరాలు

పట్టణంలోని కడప రోడ్డులో ఓ మహిళ కిరాణా షాపులో ఒంటరిగా ఉండడం గమనించి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కెళ్లారు. అలాగే పట్టణంలో అనేక చోట్ల బీరువాలు లాకర్లు బ్రేక్ చేసి బంగారు నగలు అపహరించారు. చిల్లర దుకాణాల్లో రాత్రుల్లో తలుపులు పగలొగొట్టి నగదు అపహరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి పెట్టి గంజాయి, దొంగతనాలు అరికట్టాలని పులివెందుల ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక నిఘా పెట్టాం



పులివెందుల డివిజను పరిధిలో గంజాయి అమ్మకాలను అరికట్టేందుకు పూర్తిస్థాయిలో కార్యాచరణ రూపొందించాం. గంజాయి విక్రయాలకు పాల్పడే కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. గంజాయి సరఫరా చేసేవారిపై ప్రత్యేకనిఘా పెట్టాం. పూర్తిస్థాయిలో గంజాయి కేసులు అదుపులోకి తెస్తాం.

-మురళీనాయక్, డీఎస్పీ, పులివెందుల

అందరికీ క్యాన్సర్ పరీక్షలు : డీఎంహెచ్‌వో

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి ఇంటిలో ఉన్న వారికి క్యాన్సర్‌పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం తమ చాంబరులో ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి ఎన్‌సీడీ 3.0 సర్వే ప్రారంభం అవుతుందన్నారు. సర్వేలో భాగంగా ప్రతి గృహంలో నివశిస్తున్న 18 ఏళ్ల పైబడ్డ స్త్రీ, పురుషులకు బీపీ, షుగరు, హిమోగ్లోబిన్, నోరు, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. 30 సంవత్సరాలు పైబడ్డ వివాహమైన స్త్రీలకు గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేస్తారన్నారు. ప్రస్తుతం ఉన్న ఆహార అలవాట్లు, జీవనశైలి విధానం వల్ల శారీరక మానసిక సామాజిక ఒత్తిడులతో పాటు రక్తపోటు, షుగరు జబ్బులతో బాధపడుతున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం జంక్‌ఫుడ్ ఆహార అలవాట్లు, గుట్కా, పాన్‌పరాక్, ఆల్కహాల్, పొగాకు సంబంధించిన చెడు అలవాట్లే అని ఆయన వివరించారు.

పిల్లలకు ఆరోగ్యపరీక్షలు : ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులందరికీ ఆర్గోగ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం అందరికీ క్యాన్సర్ పరీక్షలు అనే గోడపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్, ఆర్‌బీఎస్‌కే ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ రమేశ్, డీసీసీవో డాక్టర్ సునీత, డాక్టర్ బాలాంజనేయులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త తదితరులు

వేంపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు లభించాయి. సీఎస్‌ఈ చదువుతున్న పదిమంది విద్యార్థులు అచల కంపెనీకి రూ.4.50లక్షల వార్షిక వేతనాలతో ఎంపికయ్యారని డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. అంపేర కంపెనీ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో రూ.5లక్షల వార్షిక వేతనంతో నలుగురు విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయన్నారు. ఎంపికైన విద్యార్థులకు రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సంద్ర అభినందనలు తెలిపారు. కార్య క్రమంలో అకడమిక్ డీన్ రమేష్ కైలాష్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కడప కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడపలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆద్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాయల సంస్థ కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్ తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం కొండాయపల్లెలో గల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాలు ప్రారంభం కానున్నాయన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9-30 గంటలకు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో జాతీయ నాయకుల వేషధారణ పోటీలు ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం 2-30 గంటలకు పాఠశాల, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పాటల, వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. 15వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు పుస్తక ప్రదర్శన, 16న చెస్ పోటీలు, క్విజ్ పోటీలు, 17న బహుభాషా కవి సమ్మేళనం, 18న వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు, 19న మహిళా సాధికారత-మహిళలపై అఘాయిత్యాలు అనే అంశంపై చర్చా కార్యక్రమం ఉంటుందన్నారు. 20న బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమం జరుగనుందన్నారు. విద్యార్థులు, వివిధ స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు వారోత్సవాలను విజయవంతం చేసేందుకు హాజరు కావాలని కోరారు.

జాతీయ ఫుట్‌బాల్ టోర్నీకి నవదీప్ ఎంపిక



కడప రూరల్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్రనాయకుడు, మాజీ ప్రభుత్వ ప్లీడర్ గడ్డ గుర్రప్ప కుమారుడు జి.నవదీప్ అండర్-19 జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో మణిపూర్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు కడప నగరం డీఎస్‌ఏ స్టేడియంలో శిక్షణ పొందుతున్నారు. నవంబర్ 8, 9, 10 తేదీలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 స్టేట్‌లెవల్ మెన్ అండ్ ఉమెన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రభుత్వం నిర్వహించింది. ఈ టోర్నమెంట్‌లో బాలుర విభాగంలో జి.నవదీప్ మంచి ప్రతిభను కనబరిచి మణిపూర్‌లో జరిగే జాతీయ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఇతను కడప నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. నవదీప్ జాతీయ టోర్నమెంట్‌కు ఎంపిక కావడం పట్ల కడప బార్‌అసోసియేషన్ నాయకులు, పలువురు న్యాయవాదులు, టీడీపీ నేతలు, డీఎస్‌డీవో శిక్షకులు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు థామస్ జీవన్ బాబు అభినందించారు.

పారదర్శకంగా సాగుతున్న ఆర్మీ ఎంపికలు



అభ్యర్థుల ఆన్‌లైన్ ప్రక్రియ, రన్నింగ్‌కు ఉపక్రమిస్తున్న అభ్యర్థులు

కడప స్పోర్ట్స్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్‌ఏ స్టేడియంలో గత మూడు రోజులుగా జరుగుతున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా సాగుతోంది. సైనికుడిగా మాతృదేశ సేవలో తరించేందుకు అనువైన పరుగు పందెంతో పాటు ఇతర విభాగాలలో సైతం రాణించేందుకు జవసత్వాలను కూడగట్టుకొని మరీ అభ్యర్థులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా మైదానంలోకి ఇతరులు ఎవ్వరినీ అనుమతించకుండా, కేవలం అభ్యర్థులను మాత్రమే అనుమతిస్తూ.. ఆర్మీ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ముందస్తుగా అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టి తదుపరి మైదానంలో రన్నింగ్, హైజంప్, లాంగ్ జంప్, చినప్స్, జిగ్‌జాగ్ బ్యాలెన్స్, తదితర విభాగలలో పాల్గొనేలా బ్యాచ్‌కు 70 మందిని పంపిస్తున్నారు. కాగా, సజావుగా సాగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి తుఫాన్ అడ్డంకిగా మారనుందా అనే సందేహాలు ఉన్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా రాయలసీమలో వర్షాలు కురుస్తాయనే సంకేతాలున్న దృష్ట్యా అధికారుల్లో ఆందోళన నెలకొంది.

రాష్ట్రస్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు



పతకాలు సాధించిన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కళ్యాణ దుర్గంలో ఈనెల 9, 10 తేదీలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీలలో కడప క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీల్లో 8 మంది క్రీడాకారులు పాల్గొనగా.. ఐదుగురు ప్రతిభ కనబరచి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాయికిశోర్, ప్రధాన కార్యదర్శి షేక్షావలి వెల్లడించారు. మంగళవారం స్థానిక నాగరాజుపేటలో గల రెజ్లింగ్ కార్యాలయంలో పతకాలు సాధించి జిల్లా ఖ్యాతిని చాటిన క్రీడాకారలను అభినందించి మాట్లాడారు. ప్రధానంగా పోటీల 59 కేజీల విభాగంలో చలమల రేణుకారెడ్డి బంగారు పతకం సాధించగా, 72 కేజీల విభాగంలో సి.కీర్తనతో పాటు 92 కేజీల విభాగంలో భాస్కర్‌రెడ్డి వెండి పతకాలు సాధించారన్నారు. వీరితో పాటు 86 కేజీల విభాగంలో ఎస్.కౌశికేశ్వర్ రెడ్డి, 130 కేజీల విభాగంలో జె.వెంకట నవీన్ కాంస్య పతకాలు సాధించడం హర్షనీయమన్నారు. మున్ముందు మరిన్ని పతకాలు సాధించి జాతీయస్థాయిలో జిల్లా ఖ్యాతిని చాటాలన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆసుపత్రులు, క్లినిక్స్, ల్యాబ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య హెచ్చరించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు లేకుండా అస్పత్రులు నిర్వహించినా క్లినిక్‌లు నడిపినా, ల్యాబ్‌లు ఏర్పాటు చేసినా ఆకస్మిక తనిఖీలు నిర్వహించడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లలో ఫైర్ డిపార్టుమెంట్ అను మతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. క్లినిక్స్, ల్యాబ్స్, డయా గ్నెటిక్ సెంటర్స్, ఫిజియోథెరపీ క్లినిక్‌లు, ప్రైవేటు హాస్పిటల్స్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు వాటికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ను కూడా జతపరచాలన్నారు. మున్సిపల్ నుంచి ట్రేడ్ లైసెన్స్, బిల్డింగ్ ప్లాన్ సర్టిఫికెట్స్ జత చేయాలని, ఆసుపత్రులు ఏర్పాటు చేసిన ఏరియా ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే ఆసుపత్రి ఆర్థిక పరిస్థితి వివరాలను తెలిపే ఆడిట్ రిపోర్టును పొందుపర్చాలని, నిర్దేశించిన నిబంధనలను పాటిస్తానని రూ.50ల స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్ పొందుపర్చాలన్నారు. బెడ్స్ ఉన్న ప్రతి హాస్పిటల్‌కి ఫైర్ ఎన్‌వోసీ, కాలుష్య నియంత్రణ బోర్డు నుంచి పొల్యూషన్, బయో మెడికల్ పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి హాస్పిటల్‌తో పాటు డయాగ్నస్టిక్ సెంటర్లలో ఏ పరీక్షకు ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ధరల పట్టికను నోటీస్ బోర్డులో ప్రకటించాలన్నారు.

కువైత్‌లో రోడ్డు ప్రమాదం బద్వేలు వాసి మృతి

బద్వేలుటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణం లోని చాకలివీధికి చెందిన షేక్‌మౌలాలి(55) కువైత్‌లో శుక్ర వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మౌలాలి గత కొన్ని సంవత్స రాలుగా కువైత్‌లో టైలర్ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కువైత్‌లో ఓ పని నిమిత్తం బస్సులో వెళుతుండగా.. బస్సు ప్రమాదానికి గురికావడంతో మౌలాలి అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడి స్నేహితుల ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక్క కుమారుడు ఉన్నారు. కాగా మంగళవారం మృతదేహానికి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మహిళ ఆత్మహత్య

ఎర్రగుంట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎర్ర గుంట్ల-ముద్ద నూరు రోడ్డులో నివాసం ఉంటున్న కల్లూరు శైలజ (32) మంగళ వారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కంచన్నగారిపల్లెకు చెందిన వీరారెడ్డితో శైలజకు ఆరు సంవ త్సరాల క్రితం వివాహమైంది. రెండేళ్లుగా అనారోగ్య సమస్యలు ఉండటంతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నా ఆరోగ్యం నయం కాలేదు. దీంతో ఆమె మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా బ్రహ్మంగారి జయంతి మహోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యులు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి మహోత్సవాలు మంగళవారం పూర్వపు మఠాధిపతుల కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభ మయ్యాయి. ఉదయం ఆలయ ప్రాంగణంలో యాగశాల ప్రవేశం, కలశాలస్థాపన తదితర ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం స్వామివారికి ఆలయ ప్రాంగణం నుంచి కలశాల గ్రామోత్సవాన్ని నిర్వహించి.. పురవీధుల గుండా మహిళలచే కళాశాలు ఊరేగింపుగా తీసుకెళ్లి వీరబ్రహ్మేంద్రపార్కులో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫిట్‌పర్సన్ శంకర బాలాజీ, మేనేజరు ఈశ్వరాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వంక పోరంబోకులో..రాత్రికి రాత్రే అక్రమ కట్టడాలు

- ఉదయం వచ్చి కూల్చేసిన అధికారులు
- అధికారులకు, ఆక్రమణదారులకు మధ్య వాగ్వాదం



గంగరాజపురం ప్రధానదారి పక్కనే అక్రమ నిర్మాణాన్ని కూలదోస్తున్న అధికార సిబ్బంది

రైల్వేకోడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరాజపురం పంచాయతీ గంగరాజపురం గ్రామం సర్వే నెంబరు 178లోని 2.3 ఎకరాల వంక పొరంబోకు విస్తీర్ణంలో సోమవారం రాత్రికి రాత్రే కొందరు పునాదులు తీసి ఏకంగా షెడ్డు నిర్మాణం చేపట్టారు. విషయం తెలిసి మంగళవారం ఉదయం రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖాధికారులు రంగంలోకి దిగి పనులు నిలుపుదల చేయించి ఆక్రమణలు కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజల మధ్య వాగ్వాగం చోటు చేసుకుంది. రైల్వేకోడూరు తహశీల్దార్ మహబూబ్ చాంద్, వీఆర్వో సుజని తమ సిబ్బందితో ఆక్రమణలను తొలగించి బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఆక్రమణ చేసిన స్థలం పూర్తిగా వంకపొరంబోకు అని తెలిపారు. ఈ స్థలాన్ని ఎవరూ ఆక్రమించరాదని తెలిపారు. అలా ఆక్రమించడానికి చూస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 2.3 ఎకరాలు పూర్తిగా వంక పొరంబోకు స్థలం అని తెలిపారు. షెడ్డు నిర్మాణం పక్కనే కొందరు వ్యక్తులు నిర్మాణాలు చేయడానికి గుంతలు తీసి ఉండడాన్ని గుర్తించి వాటిని కూడా పూడ్చివేశామన్నారు. ఎవరు ఆక్రమించినా వదిలే ప్రసక్తి లేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం వంక పొరంబోకు స్థలాలు, ఏటి పొరంబోకు స్థలాలు ఎవరూ ఆక్రమించరాదని తెలిపారు. ప్రభుత్వ స్థలాలపై రెవెన్యూశాఖ కన్నువేసి ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బందిపై దౌర్జన్యం చేస్తే మాత్రం కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణదారులపై ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్వో సుజని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ కే.హేమసుందరరావు తెలిపారు. రైల్వేకోడూరు ఎస్ఐ నవీన్‌బాబు, ఆర్ఐ లక్ష్మీదేవి, సర్వేయర్ బాలసుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ ఏఈ మధుసూధన్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గండి క్షేత్రంలో ప్రారంభమైన పవిత్రోత్సవాలు




చక్రాయపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండిలో పవిత్రోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, విశ్వక్షేణ ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనధారణ, వాస్తు హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

డాక్టర్ విజయలక్ష్మిదేవికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా అవార్డును స్వీకరిస్తున్న విజయలక్ష్మిదేవి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) :ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ విజయలక్ష్మిదేవి రాష్ట్రఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా స్వీకరించారు. ఈ నేపథ్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీం బాషా హర్షం వ్యక్తం చేశారు.



పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక, పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేశ్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌జేడీ కార్యాలయంలో ఆర్‌జేడీని కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పద్మాకర్, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులతోనే మధుమేహ నివారణ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవనశైలిలో మార్పులతోనే మధుమేహ నివారణ సాధ్యమని డాక్టర్ ఎంఎల్ఎన్ ప్రసాదరాజు తెలిపారు. మంగళవారం కడప నగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని జేవీవీ, మహిళా డిగ్రీ కళాశాల జంతు శాస్త్ర విభాగం ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో మధుమేహంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారిన ఆహార అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం, ఒత్తిడి, ఆధునిక జీవనశైలిలో వచ్చిన మార్పుల వల్ల పల్లె, పట్నం అనే తేడా లేకుండా మధుమేహం చాపకిందనీరులా విస్తరిస్తోందన్నారు. మధుమేహ దుష్ప్రభావాలు శరీరంలోని గుండె, కళ్లు, మూత్రపిండాలతో పాటు అన్ని అవయవాలపై పడతాయన్నారు. నివారణకు సంప్రదాయ ఆహార నియమాలు, తక్కువ కార్బొహైడ్రేట్స్, ప్రొటీన్స్ తీసుకుంటూ శారీరక శ్రమ, మానసిక ప్రశాంతతో ఒత్తిడిని జయిస్తే వ్యాధి నివారణ సాధ్యమన్నారు. ప్రిన్సిపాల్ సలీంబాషా మాట్లాడుతూ అవగాహన మధుమేహానికి సరైన చికిత్స అని, విద్యార్థులు తమ దైనందిన జీవితంలో సరైన అలవాట్లు అలవరచుకుని మధుమేహాన్ని జయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మధుమేహ వ్యాధిపై ఆర్.శ్రీనివాసరెడ్డి రూపొందించిన చాయా చిత్రం పోస్టర్లను విద్యార్థులకు వివరించారు.

శ్మశానాన్ని కాపాడాలని పోలీసులకు గ్రామస్థుల వినతి

సీకేదిన్నె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్మశానాన్ని కాపాడాలని సీకేదిన్నె మండలం మూలవంక ప్రజలు కోరుతున్నారు. తమ పెద్దల కాలం నుంచి ఉన్న శ్మశాన స్థలాన్ని ఓ వ్యక్తి తనదిగా చెప్పుకుంటూ రికార్డులు సృష్టించడంతో పాటు ఆ శ్మశానంలోని తమ పూర్వీకుల సమాధులను కూల్చేశారన్నారు. మంగళవారం ఆ వ్యక్తి శ్మశానం వద్దకు రావడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి ఇరువర్గాల వారిని స్టేషన్‌కు పిలిపించారు. చట్టప్రకారం నడుచుకోవాలని వారిని హెచ్చరించి పంపించారు.



చెన్నూరు మండలం శివాలపల్లెకు వెళ్లే దారిలో కేసీ ప్రధాన కాల్వపై రివిట్‌మెంటు నాలుగుచోట్ల దెబ్బతింది. దాదాపు మూడు అడుగుల పొడవునా నెర్రలుబారింది. రెండు అడుగులు పైగా చీలింది. అలాగే పెద్దరంధ్రాలు పడ్డాయి. సిమెంటు రోడ్డు ఎత్తు కూడా తగ్గింది. ఈ కల్వర్టు గుండా భారీ వాహనాలు వెళితే కచ్చితంగా ప్రమాదం జరుగుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-చెన్నూరు, (ఆంధ్రజ్యోతి)

కడప ఉక్కుకు నిధులేవీ: డీవైఎఫ్ఐ

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడం బాధాకరమని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నగర కన్వీనరు విజయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

18 మందిపై కేసు నమోదు

వేంపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని కడప రోడ్డులో సోమవారం రాత్రి అల్లరిమూక ఘర్షణకు సంబంధించిన వ్యవహారంలో ఇరువర్గాలకు చెందిన 18 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. శ్రీకాంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8 మందిపై, నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 10 మందిపైకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విత్తన శుద్ధి చేసుకోవాలి

పెండ్లిమర్రి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రబీలో వేసేపంటలకు ట్రైకోడెర్మావిరిడితో విత్తన శుద్ధి చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన పెండ్లిమర్రిలో కర్నాటి వెంకటసుబ్బారెడ్డికి చెందిన మినుము పంటను ఆయన పరిశీలించారు. రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశానికి బాలలే భవిష్య సంపద

కడప ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దేశానికి బాలలే భవిష్య సంపద అని వైవీయూ ప్రొఫెసరు ఎన్.ఈశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడప నగరం పాలకొండల సమీపంలో గల నగర వనంలో ఇంటాక్ ఆధ్వర్యంలో బాలల వన మహోత్సవం నిర్వహించారు. కడప నగరానికి చెందిన పలు పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చదువు అంటే తెలుసుకోవడమేనని, అది జ్ఞానాన్ని ప్రసాదిస్తుందన్నారు. జ్ఞానమే నిజమైన బలమని, మానవుడికి శక్తినిచ్చే సాధనమని అన్నారు. ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనరు లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన బాల్యం శారీరక మానసిక ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, డాక్టర్ రంగనాథరెడ్డి తదితరులు మాట్లాడారు.

టీడీపీ సభ్యత్వంతో ప్రయోజనాలు

వేంపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకుంటే పలు ప్రయోజనాలు ఉంటాయని ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డి అన్నారు. వేంపల్లె గండి రోడ్డులోని ఆయన కార్యాలయం వద్ద మంగళవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బాలస్వామిరెడ్డి, రైతు విభాగం కార్యదర్శి జగన్నాథరెడ్డి, ఆర్వీ రమేష్, ఎద్దుల శేషారెడ్డి, పాములూరు రామాంజనేయరెడ్డి తదితరులతో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

కడప నాగరాజుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని జిల్లా ఉపకార్మిక కమిషనర్ బి.శ్రీకాంత్ నాయక్ అన్నారు. మంగళవారం నగరంలోని కోఆపరేటివ్ కాలనీ, నెహ్రూ పార్కు, అన్నమయ్య సర్కిల్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి షాపులను తనిఖీ చేశారు. ఎవరైనా బాల బాలికలను పనిలో ఉంచుకున్నట్లయితే చట్టరీత్యా చర్య లు తప్పవ న్నారు. తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను బడిలో ఉంచాలన్నారు.

విజయదుర్గ సన్నిధిలో రాహుకాల పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు (ఇన్‌సెట్) విజయదుర్గాదేవి

కడప కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయదుర్గాదేవి సన్నిధిలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజలకు ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు హాజరై నిమ్మకాయలతో కూడిన రాహుకాల పూజలు చేపట్టారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రాహుకాల పూజలు నిర్వహించారు. ఈనెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున 5 గంటలకు అమ్మవారికి విశేష అభిషేకం, 10 గంటలకు ఆలయ యాగ మండపంలో చండీహోమం నిర్వహించనున్నారు. తదుపరి సహస్ర లింగార్చన, సుమంగళిపూజ, రాత్రి 7 గంటలకు 108 మంది ముత్తైదువలచే 108 దీపాలతో అష్టోత్తర దీపాలంకార చేయనున్నారు. కావున భక్తులు ఆ తల్లిని దర్శించుకుని ఆశీస్సులు అందుకోవాలని ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, ఆలయ నిర్వాహకుడు దుర్గా ప్రసాద్ కోరారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్

సింహాద్రిపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు సింహాద్రిపురం వివేకానంద హైస్కూల్ విద్యార్థులు దీక్షిత, అతికుల్ రెహమాన్ ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి తెలిపారు. కమలాపురంలో రగ్బీ రాష్ట్ర స్థాయి అండర్-14 బాలబాలికల విభాగంలో ఎస్‌జీఎఫ్ పోటీలు జరిగాయి. దీక్షిత, అతికుల్ రెహమాన్ కడప జిల్లా రగ్బీ జట్టులో జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. ఆ విద్యార్థులను కరస్పాండెంట్ ఖాదర్‌వలి, డైరెక్టర్ కెఎమ్డీ జాఫర్, పీఈటీ త్రిలోక్‌నాథ్‌రెడ్డి, సిబ్బంది అభినందించారు.

మాజీ ముఖ్యమంత్రిని కలిసిన పాకా సురేశ్



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన సురేశ్, బాలస్వామిరెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలో మంగళవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కడప 47వ డివిజన్ కార్పొరేటరు పాకా సురేశ్ కలిశారు. కడప నియజకవర్గంలో పలు డివిజన్‌లలో ప్రజలు పడుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా అక్కాయపల్లె, చెమ్ముమియ్యాపేట, రామరాజుపల్లె, అలంఖాన్‌పల్లె, పాలెంపల్లి, కడపలలో పలు సమస్యలున్నాయన్నారు. జగన్ స్పందిస్తూ పార్టీ స్థానిక నేతలతో, జిల్లా అధ్యక్షుడితో సమన్వయం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. జగన్‌ను కలిసిన వారిలో కార్పొరేటర్లు బాలస్వామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సోషల్ మీడియా పేరుతో వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు

● వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) :సోషల్ మీడియా పేరుతో వైసీపీ కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్రా వరప్రసాద్‌రెడ్డిని అరెస్టు చేసి ఎంపీ పేరు చెప్పాలని ఒత్తిడి తేవడం దుర్మార్గమన్నారు. వర్రా రవీంద్రరెడ్డిపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం బాధాకరమన్నారు. జగన్ ప్రభుత్వం మళ్లీ రావడం ఖాయమన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో దోమల నివారణ చర్యలు



చెన్నూరు అంగన్వాడీ కేంద్రం వద్ద ఉన్న మురుగు నీటికుంటలో దోమల నివారణకు మందు వేస్తున్న అధికారులు

చెన్నూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మురుగు నీటి కుంటతో అంగన్వాడీ చిన్నారులకు ఇబ్బందులపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'చిత్రం చెప్పిన సమస్య'కు అధికారులు వెంటనే స్పందించారు. ఈ మేరకు చెన్నూరు కొత్తగాంధీనగర్ అంగన్వాడీ కేంద్రం వద్ద ఉన్న మురుగు నీటి కుంటలో మంగళవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇకపై ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపడతామన్నారు. నీటి కుంటలో ఆయిల్‌బాల్స్, దోమల నివారణ మందులను వేశారు. అంతేకాక నీరు నిల్వ లేకుండా త్వరలో కాల్వను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌వైర్ చోరీ



లింగాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గృహాలకు విద్యుత్ సరఫరా చేసే సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. మండలంలోని వెలిదండ్ల గ్రామంలో ఒకటి, పెద్దకుడాల గ్రామంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను సోమవారం రాత్రి దొంగలు ధ్వంసం చేసి కాపర్ వైర్ తీసుకెళ్లారు. ఒక్కొక్క ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ.1.25లక్షలు ఉంటుందని, కాపర్ వైర్ విలువ రూ.20వేలు అని ఏఈలు రమేష్, బాలసంజీవులు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వెల్లడించారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

పులివెందుల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి, ఎంఈఓ రామానాయుడు, ఏపీఎం గురురాజ్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో అంగన్వాడీ వర్కర్లు, యానిమేటర్లకు అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లర్నింగ్ ఫర్ ఆన్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. డబ్బు లావాదేవీలు, ప్రభుత్వ పథకాలు తదితర అన్నింటికీ ఫోన్ తప్పకుండా అవసరమేనన్నారు. ఫోన్ ద్వారా కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతూ చదువురాని వారిని సులువుగా మోసం చేస్తున్నారన్నారు. వీటి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందన్నారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబున్ని, వెలుగు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆంధ్రా కళాదర్శిని పుస్తకం'లో వైవీయూ అధ్యాపకుడి చిత్రాలు



వీరప్పను సత్కరిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత రాజు తదితరులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా కళాదర్శిని అనే పేరుతో ఆర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పుస్తక ప్రచురణలో వైవీయూ లలిత కళల విభాగ అధ్యాపకుడు వీరప్ప చిత్రాలు ప్రచురితమయ్యాయి. 64 కళలు డాట్‌కమ్, డైరెక్టర్ కళాసాగర్ నేతృత్వంలో సంకలనం చేసిన ఆర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చిత్రకారుల డైరీని ఆవిష్కరించారు. విజయవాడ వేదికగా ఆవిష్కరించిన ఆర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 300 మంది చిత్ర, శిల్ప, హస్తకళాకారుల సమగ్ర వివరాలు పొందుపరిచారు. ఈ పుస్తక లలిత కళావిభాగ అధిపతి డాక్టర్ కె.మృత్యుంజయరావు ఎడిటోరియల్ మెంబరుగా వ్యవహరించారు. వీరప్పను సత్కరించి పుస్తకం అందించారు. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి విభాగాధిపతి డాక్టర్ మృత్యుంజయరావు వీరప్పను అభినందించారు.

కార్తీక వారాలలో మైదుకూరు నుంచి స్పెషల్ బస్సులు

మైదుకూరు రూరల్,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారాలలో పుణ్యక్షేత్రాల సందర్శన కోసం మైదుకూరు నుంచి స్పెషల్ బస్సులు నడుతున్నట్లు మైదుకూరు డిపో మేనేజర్ శ్రీరాం కుమార్ మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైదుకూరు నుంచి కార్తీక సోమవారాలలో పుణ్యక్షేత్రల దర్శనాల నిమిత్తం అవరావతి,సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, ఓంకారం, శ్రీశైలం, త్రిలింగ దర్శన, అరుణాచలగిరి ప్రదర్శన తదితర పుణ్యక్షేత్రాల దర్శనానికి ఆన్‌లైన్ రిజర్వేషన్‌కు 98854 48199 కు కాల్ చేయాలన్నారు.

బద్వేలు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా కన్యాకుమారి బాధ్యతల స్వీకరణ



బద్వేలు , నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) :బద్వేలు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా మంగళవారం కన్యాకుమారి బాధ్యతలు స్వీకరించారు. కడప ఆర్టీసీ డిపోలో అసిస్టెంటు మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న కన్యాకుమారి బదిలీపై రాగా ఇక్కడ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు రాయదుర్గం డిపో మేనేజర్‌గా వెళ్లారు.

దుమ్ము నుంచి పంటలను కాపాడండి

పెద్దనపాడు రైతుల ఆవేదన ● ఎక్స్‌ప్రెస్ హైవే పక్కన పంటలు దుమ్ముతో నాశనం ● పత్తి, శనగ, నువ్వుల పంటలకు భారీ నష్టం



దుమ్ముపడి ఎర్రగా మారిన నువ్వులపంట



ఎర్రబడిన పత్తిని, కాయలను చూపిస్తున్నరైతులు

ఎర్రగుంట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎక్స్‌ప్రెస్ హైవే వెంబడి వేసిన పంటలు దుమ్ముతో నాశనమౌతున్నాయని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయ వాడు-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా మట్టిరోడ్డు వేస్తున్నారు. టిప్పర్లు, ఇతర వాహ నాల వెళుతుండటంతో ఎక్కువగా దుమ్ము లేస్తోంది. ఈ దుమ్ము రోడ్డుకు ఆనుకుని ఉన్న పంటపొలాలపై పడి ఎర్రగా మారుతున్నాయి. దీని వల్ల పంటలు నాశనమౌతున్నాయి. ఎర్రగుంట్ల మండలంలోని పెద్దన పాడు సమీపంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణం సందర్భంగా సమీపంలో వేసిన పత్తి, శనగ, నువ్వుల పంటలపై ఈ దుమ్ము ప్రభావం అధికంగా ఉంది. తెల్లగా ఉండాల్సిన పత్తి పంట ఎర్రగా మారిపోయింది. దీంతో కొనేందుకు ఎవ్వరు ముందుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎర్రటి దుమ్ము పంటపై పేరుకు పోవడంతో కూలీలు కూడా పత్తిని ఒడిపేందుకు ముందు కు రావడంలేదని వాపోతున్నారు. అలాగే నువ్వులపంట పై కూడా దుమ్ము పడటంతో ఎదుగుదల లేకుండా పోయింది. శనగ పంటకు ఎంత మందు కొట్టినా దుమ్ము ధాటికి పనికిరాకుండా పోతోందని రైతులు ఆవేదనచెందు తున్నారు. పందలాది ఎకరాల్లో సాగుచేశామని వేలకువేలు ఖర్చుచేశామని తీరా దుమ్ము తో తమ పంటలు నాశనమై తీవ్ర నష్టం వాటిల్లుతోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● నీరు చల్లి చర్యలు తీసుకుంటాం-మెగా కంపెనీ ప్రతినిధులు

రైతులకు నష్టం రాకుండా పనులు జరిగే చోట రోజూ నీరు చల్లుతామని ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు చేపట్టిన మెగా కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఇకపై ఎలాంటి దుమ్ము రానివ్వమన్నారు. సబ్ కాంట్రాక్టర్ తప్పిదం వల్ల ఇలా జరిగివుండవ చ్చునని, భవిష్యత్తులో రైతులకు ఎలాంటి ఇబ్బందిరాకుండా చర్యలు తీసుకుంటా మన్నారు.

● ఎకరన్నరకు రూ.80వేల పెట్టుబడి పెట్టాం-మల్లుగంగిరెడ్డి, పెద్దనపాడు.

ఎకరన్న చేలో పత్తి పంట సాగుచేశా. సుమారు రూ.80వేల వరకు పెట్టుబడులు పెట్టా. తీరా పంట కోత దశలో ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణ పనుల వల్ల వచ్చే దుమ్ము పొలంలో పడుతోంది. దీని వల్ల పంటపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పత్తికాయలు నల్లబడి కమిలిపోతున్నాయి. వచ్చిన దిగుబడి కాస్త ఎర్రగా మారిపోతోంది. దీని వల్ల కొనుగోలు చేసేందుకు వ్యాపారులు రావడంలేదు. పత్తిని వడిపేందుకు కూలీలు కూడా దుమ్ములో పనిచేయలేమని వెనక్కి వెళ్లారు. దీంతో భారీగా నష్టం వస్తోంది. ప్రభుత్వం లేదా కంపెనీ వారు నష్టపరిహారం ఇవ్వాలి.

భారీ నష్టమే

దుమ్ము వల్ల పంటలకు భారీ నష్టమే జరిగింది. మంగళవారం రైతుల కోరిక మేరకు పంటను పరిశీలించా. పత్తి పంట దిగుబడి బాగా తగ్గింది, కాయలు నల్లగా రాలిపోతున్నాయి. వచ్చిన పంటకూడా ఎర్రగా మారడంతో గిట్టుబాటు ధర రైతులకు రాదు. ఎర్రదుమ్ము ప్రభావం ఉన్న చోట నువ్వులపంట అసలు ఎదుగుదల లేకుండా పోయింది. శనగపంటకు మందు పట్టడంలేదు.

శ్రీకాంత్‌రెడ్డి,ఏవో

పనులను అడ్డుకుంటాం : రైతులు

పంటపై ఎర్రదుమ్ము పడకుండా నిర్మాణాన్ని చేపట్టిన కంపెనీవారు చర్యలు తీసుకోకపోతే పనులను అడ్డుకుంటామని రైతులు హెచ్చరించారు. ఇప్పటికే తీవ్రంగా నష్టపోయామని ఈవిషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. నష్టపరిహారం కోరుతామ న్నారు. పనులు జరిగేచోట దుమ్ము లేయకుండా నీరు పట్టాలని వారు డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరిస్తాం.. చట్టబద్ధంగా వ్యవహరిస్తాం

అక్బల్‌బాష,తహసీల్దారు



ముఖాముఖి

దువ్వూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సంబంధమైన ఎటువంటి సమస్యలున్నా వాటిని పరిష్కరిస్తామని దువ్వూరు తహసీల్దారు అక్బల్‌బాష తెలిపారు. మండలంలో నెలకొన్న సమస్యలపై ఇప్పటికే ఒక అవగాహన ఉందని, వీలైనంత త్వరగా ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

ప్రశ్న: మండలంలో భూ సమస్యలు ఏమైనా ఉన్నాయా. ఉంటే అవి ఎటువంటివి?

జవాబు: ఒకమాదిరిగా ఉన్నాయి. భూముల ఆన్‌లైన్ విషయంలో ఒకరికి బదులుగా మరొకరికి ఆన్‌లైన్ కావడం. పొలాల్లో వెళ్లేందుకు రైతుల మధ్య రస్తా తగాదాలు. సరైన విచారణ లేకుండా ఒకరికి బదులుగా మరొకరికి హక్కు కల్పించి పత్రాలుజారీ చేయడంలాంటివి గమనించాను.

ప్రశ్న: ప్రభుత్వ భూములకు నిబంధనలకు విరుద్ధంగా కొందరు అక్రమ మార్గాల్లో పట్టాలు పుట్టించుకున్నారనే ఆరోపణలపై మీరేమంటారు?

జవాబు: భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా 2023 సంవత్సరంలో గత ప్రభుత్వంలో అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చారు. అనర్హులకు పట్టాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. విచారణ జరపాలని రైతులు కోరుతున్నారు.

ప్రశ్న: మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలపై మీ స్పందన ఏమిటి?

జవాబు: అలా అక్రమ తవ్వకాలు చేపడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. అనుమతులు తీసుకుని తవ్వకాలు చేయాలి.

ప్రశ్న: విధుల నిర్వహణలో మీకు, సిబ్బందికి రాజకీయ ఒత్తిళ్ల ఉన్నాయా?

జవాబు: విధుల నిర్వహణలో ఎటువంటి ఒత్తిడులు లేవు. సిబ్బంది మధ్య కోఆర్డినేషన్‌తో సమస్యలు ఏవైనా ఉంటే వాటిని చక్కబెడుతున్నాం.

ప్రశ్న: విలువైన ప్రభుత్వ స్థలాలు భూస్వాములు అన్యాక్రాంతం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి?

జవాబు: ఇటువంటి విషయాలు మా దృష్టికి రాలేదు. అలాంటివి ఏవైనా ఉంటే చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటాం.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వఆసుపత్రిని తనిఖీ చేసిన డీసీహెచ్ఎస్



ప్రభుత్వాసుపత్రిలో మందులను పరిశీలిస్తున్న అధికారులు

బద్వేలుటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మసిస్టులు కాలం చెల్లిన మందులు ఇవ్వడం వలన జితేష్ కుమార్ అనేబాలుడు అస్వస్థతకు గురైన విషయం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో డీసీహెచ్ఎస్ హిమాదేవి మంగళవారం ప్రభుత్వాసుపత్రిని తనిఖీచేసి రికార్డులను, వార్డులను, మందుల గదిని పరిశీలించారు. అస్వస్థతకు గురైన జితేష్‌కుమార్ తల్లిదండ్రులను పిలిపించి వారితో మాట్లాడిన అనంతరం ఫార్మసిస్ట్‌లను ఆరోజు ఎవరైతే విధుల్లో ఉన్నారో వారిని విచారిం చారు. కాలం చెల్లిన సిరప్‌ను ఇవ్వడం వల్ల అస్వస్థతకు గురవడం వాస్తవమేనని, వీటిపై విచారణ చేస్తున్నామని, నిర్లక్ష్యంగా ఉన్న ఫార్మసిస్ట్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే వరద పుట్టిరోజు వేడుకలు



వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న మునివర, లక్ష్మీరెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రాజకీయాల్లో ప్రజల శ్రేయస్సు కోరే ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి లాంటి నాయకులు అరుదుగా వుంటారని టీడీపీ నాయకుడు మున్సిపల్ మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు, బోసం గురివిరెడ్డి, చౌటపల్లె లక్ష్మీరెడ్డి, మునివర పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, టీడీపీ శ్రేణులు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి టీడీపీ కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో వరదరాజులరెడ్డి సోదరుడు ఆనంద భార్గవరెడ్డి, పల్లా శంకర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా బోసం గురివిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు. టీడీపీ నాయకులు చౌటపల్లె లక్ష్మీరెడ్డి, మునివర ఆధ్వర్యంలో దొరసానిపల్లె వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, ఫలహారాలు పంపిణీ చేశారు.

నేడు గ్రామ పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ

బి.కోడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్ని శాఖల అధికారు లకు బుధవారం ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి ఉదయం 10గంటలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన అన్నారు.

'పది'లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

ప్రొద్దుటూరు టౌన్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో మీనాక్షి పేర్కొన్నారు. మంగళవారం డిప్యూటీ డీఈవో కార్యాలయంలో ఎంఈవోలు, ఉన్నత పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు త్వరగా సిలబస్ పూర్తి చేసి స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు త్వరగా స్టడీ మెటీరియల్ అందజేస్తామనితెలిపారు. ఏ పాఠశాలలోనైనా పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుల కొరత వుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యార్థుల అపార్ ఎఫ్ఏ 1 ,ఎఫ్ ఏ 2 పరీక్షల మార్కులను త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. బడికి రాని విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి ప్రతి రోజు బడికి వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలోప్రొద్దుటూరుఎంఈవోలు సావిత్రమ్మ, శోభారాణి ఇతర మండలాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

'5నెలలు అయినా రైతులను పట్టించుకోని ప్రభుత్వం'



వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల, నవంబరు 12 ఆంధ్రజ్యోతి): వందరోజుల్లో రైతుల సమస్యలు సరిష్కరిస్తానని అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం 5నెలలు అవుతున్నా పట్టించుకోవడంలేదని జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం నిడుజువ్వి గ్రామంలో నిర్వహించిన సర్వే ఆఫ్ విలేజెస్ మ్యాపింగ్ విత్ ఇంప్రువైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజెస్ అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అన్ని రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్న చంద్రబాబు 150రోజులు అవుతున్నా ఇప్పటికీ పట్టించుకోలేదన్నారు. వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నంగనూరుపల్లెలో చోరీ

ప్రొద్దుటూరు నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం నంగరూరుపల్లెలోని ఓ ఇంట్లో చోరీ ఘటన వెలుగు చూసింది. ఈ చోరీలో 9తులాల బంగారం అపహరణ తోపాటు పట్టాదారు పాసు పుస్తకాలు కనబడటంలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. నంగనూరు పల్లెకు చెందిన బైరగాని మునెయ్య ఆర్టీసీలో ఉద్యోగి. తన ఇద్దరు కుమారులు బెంగళూరులో నివాసముంటున్నారు. ఈ నెల 9 తేదీన బెంగళూరులో వుంటున్న తనకుమారుల ఇంటికి వెళ్లారు. తిరిగి 12 తేదీ తెల్లవారుజామున ఇంటికి వచ్చారు. రాగానే ఇంటి తలుపులు తెరవగానే ఇంట్లో కారంపొడి చల్లివుండటం, వస్తువులన్నీ చెల్లా చెదురుగా పడివున్నట్లు గుర్తించారు. తూర్పు వైపున డోర్ కింది భాగం కోసం రంధ్రం వేసినట్లు గుర్తించారు. ఇంట్లోవున్న రెండు బెడ్ రూముల్లో వున్న బీరువాలు పగులగొట్టారు. వస్తువులన్నీ చెల్లా చెదురుగా పడివున్నట్లు గుర్తించారు. బీరువాలో వున్న లాంగ్‌చైన్, హారం,గాజులు కంకణాలు, ఉంగరాలు, కమ్మలు, మాటీలు సుమారు 9 తులాల మేర బంగారు నగలు అపహరణకు గురయినట్లు తెలిపారు. అంతేకాకుండా పోరుమామిళ్ల మండలం కోడిగుడ్ల పాడు గ్రామంలో వున్న భూములకు సంబంధించి వున్న రెండు పాసుపుస్తకాలు కానరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని రూరల్ సీఐ బాలమద్దిలేటి పరిశీలిం చారు. బైరగాని మునెయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ భూములపై విచారణ పక్కాగా జరగాలి : ఆర్డీవో

కాశినాయన నవంబరు(ఆంధ్రజ్యోతి)12: అక్కెంగుండ్ల,సావిశెట్టిపల్లె,ఇటుకులపాడు గ్రామాల్లోని ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణచేసి నివేదిక ఇవ్వాలని బద్వేల్ ఆర్డీవో చంద్రమౌళి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపురం తహసీల్దారు కార్యాలయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన రెవెన్యూ అధికారుల బృందాలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా ఇటుకులపాడు,అక్కెంగుండ్ల,సావిశెట్టిపల్లె రెవిన్యూ గ్రామాల్లోని ప్రభుత్వ భూములపై పలుఆరోపణలు ఉన్నాయన్నారు. 15 రోజులలోపు నివేదికలు ఇవ్వాలనిదిశానిర్దేశం చేశారు. ఈకార్యక్రమంలోతహసీల్దారు వెంకటసుబ్బయ్యడీటీ రవిశంకర్, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, వీఆర్వోచంద్రఓబుల్‌రెడ్డి,జూనియర్‌అసిస్టెంట్ వైష్ణవి పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధే లక్ష్యం

పోరుమామిళ్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల పంచాయతీ అభివృద్ధే లక్ష్యమని సర్పంచ్ యనమల సుధాకర్ అన్నారు.మంగళవారం ఆయన పోరుమామిళ్లలో సుమారు రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంటురోడ్ల పనులను పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్ల పంచాయతీకి ఉపాధి గ్రామీణ పథకం ద్వారా 53లక్షల నిధులు సిమెంటు రోడ్ల నిర్మాణానికి మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రసాద్, చెనుప్ప రమణ, దర్వేష్, లక్ష్మణరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

భవిష్యత్తు కోసమే టీడీపీ సభ్యత్వ నమోదు

అట్లూరు,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు కోసమే టీడీపీ సభ్యత్వ నమోదు అని టీడీపీ నేతలు అన్నారు. మంగళవారం కుమ్మరివారిపల్లె, వరదరాజుపల్లె, కోనరాజు పల్లె, ముత్తుకూరు, సూరాయిపల్లె గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నేతలు మంచూరి సూర్యనారాయణరెడ్డి, అరవ శ్రీనివాసుల రెడ్డి, పోతిరెడ్డి రెడ్డయ్య, పుల్లారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, నవీన్‌రెడ్డి పరంధామ రెడ్డి, చెంచురెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, సుదర్శన్‌రావు, రామసుబ్బారెడ్డి, రెడ్డిమాదిగ, రెడ్డిగోపాల్‌రెడ్డి, గురుప్రసాద్ రెడ్డి, కుప్పయ్య, ఎర్రపరెడ్డి, సూరారెడ్డి, శ్రీనివాసులు, రామక్రిష్ణారెడ్డి, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్షరాస్యతను పెంచడమే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ముద్దనూరు ఎంపీడీవో ముకుందారెడ్డి

ముద్దనూరు నవంబరు12(ఆంధ్రజ్యోతి):నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ పథకం లక్ష్యమని ఎంపీడీవో అలవలపాటి ముకుందారెడ్డి పేర్కొన్నారు.స్థానిక ఎంపీడీవో సభాభవనంలో మంగళవారం వెలుగు, అంగన్వాడీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఎంపీడీవో మాట్లాడుతూ వయోజనులు, డ్వాక్రా సంఘాల మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు.ఇందుకోసం స్వచ్చంద టీచర్లను గుర్తించాలని అలాగే తరగతులు నిర్వహణకు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, అనుకూలమైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం అపర్ణ, సీడీపీవో ముంతాజ్‌బేగం, జయచంద్రారెడ్డి,ఎంఈవోలు నాగేశ్వరనాయక్, సుబ్బారావు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని ఎంపిడీవో సీ.వెంకటరమణయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఎర్రగుంట్ల ఎంపీడీవో కార్యాలయంలో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ అడల్ట్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ రంతుల్లయ్య, వెలుగు ఏపీవో జగదీశ్వరి, ఎంఈవో శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: గ్రామీణప్రాంతాల్లోని వయోజనులు మహిళలకు డిజిటల్ అక్షరాస్యత ,ఆర్థిక అక్షరాస్యత, న్యాయ అక్షరాస్యతపై ఎంపీడీవో రమణారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఉన్న భవనంలో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీయం రవిచంద్రారెడ్డి, గ్రామ సమాఖ్య సభ్యులు, కార్యదర్శులు ఓబులేసు,పంచాయతీ కార్యదర్శి రాజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

బి.కోడూరు..: బి.కోడూరు ఎంపీడీవో భాస్కర్‌రావు కార్యాలయం సభాభవనంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సభనుద్దేశించి ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యత అంగన్వాడీ కార్యకర్తల పై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సునీల్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజరు సుగుణ, వెలుగు ఏపీఎం సీతారామిరెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాజీపేట..: రాష్ట్ర ప్రభుత్వం నిరక్షరాస్యత శాతం తగ్గించేందుకు ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తోందని ఎంపీడీవో దివిజాసంపతి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం వెలుగు యానిమేటర్లు, అంగన్వాడీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో శ్రీదేవి, సూపర్‌వైజర్లు భారతీ, రమాదేవి,ఏపీఎం శైలజ తదితరులు పాల్గొన్నారు.